మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
ప్రజా ప్రతినిధి NEWS టి.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :267 గురువారం జూలై 23 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# అనంత్‌నాగ్‌లో ఉగ్రదాడి...జవాన్ మృతి

- ఉగ్రవాదుల కాల్పుల్లో ఒక భద్రతా సిబ్బంది వీరమరణం
- మరో జవాన్‌కు గాయాలు.. కొనసాగుతున్న చికిత్స
- ప్రాంతమంతా భద్రతా దళాల గాలింపు చర్యలు

శ్రీనగర్, జూలై 22 (మనప్రజాప్రతినిధి): జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక భద్రతా సిబ్బంది మృతి చెందగా, మరో జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం అనంత్‌నాగ్‌కోకెర్‌నాగ్ రహదారిపై చోటుచేసుకుంది. సంఘటన అనంతరం భద్రతా దళాలు అప్రమత్తమై ఉగ్రవాదుల కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. అధికారుల వివరాల ప్రకారం, ప్రత్యేక ఆపరేషన్ బృందానికి చెందిన ఇద్దరు జవాన్లు బుధవారం ఉదయం అనంత్‌నాగ్‌కోకెర్‌నాగ్ మార్గంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న



ఉగ్రవాదులు వారిపై ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. ఊహించని ఈ దాడిలో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. కాల్పుల శబ్దం విన్న ఇతర భద్రతా సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్ర గాయాల కారణంగా ఒక జవాన్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. 2

## 7 వేల మెగావాట్ల షాక్‌నూ తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ

- వర్షాభావ సవాళ్ల మధ్యనూ నిరంతరాయ విద్యుత్ సరఫరా
- దేశంలో తొలిసారిగా విద్యుత్ అంబులెన్స్ సేవలు ప్రారంభం
- డిస్కంలను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే లక్ష్యమని భట్టి



2

## ఛలో లోక్‌భవన్‌లో కాంగ్రెస్ నిరసన

- రాహుల్, ప్రియాంక, విద్యార్థుల అరెస్టులను ఖండించిన కాంగ్రెస్ నేతలు
- నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన మంత్రులు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్




2

## రాహుల్, ప్రియాంక అరెస్టును ఖండించిన రేవంత్

- విద్యార్థులకు మద్దతుగా కొడంగల్‌లో నిరసనలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం ఆందోళనకరమని వ్యాఖ్య
- అదుపులో ఉన్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్




2

## భోగాపురానికి మోదీకి ఆహ్వానం



- ప్రధానితో భేటీ అయిన సీఎం చంద్రబాబు నాయుడు
- ఆగస్టు 1న విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం
- ఏర్పాట్లపై ప్రత్యేక అధికారుల నియామకం

2

## పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు



- 'మన ఇల్లు మన లోకేష్'లో రెండో రోజు పట్టాల పంపిణీ
- మంగళగిరి ప్రజల దశాబ్దాల కల నెరవేరుతోందన్న లోకేశ్
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని స్పష్టం

మంగళగిరి, జూలై 22 (మనప్రజాప్రతినిధి): 'మన ఇల్లు మన లోకేష్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో రెండో రోజు మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మంగళగిరి ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా 2

## ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ

- మచిలీపట్నంలో ప్రజల సమస్యలు విన్న మంత్రి కొల్లు రవీంద్ర
- సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు
- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం



మచిలీపట్నం,//(మనప్రజాప్రతినిధి): మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వారాంత ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని ఓర్పుగా విని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే 3

## స్కోప్జేలో గాంధీ విగ్రహావిష్కరణ...

- భారత్, ఉత్తర మాసిడోనియా అధ్యక్షుల చేతుల మీదుగా ఆవిష్కరణ
- స్నేహబంధానికి చిరస్థాయి ప్రతీకగా నిలుస్తుందని ఆశాభావం
- శాంతి, సహనం, మానవత్వానికి ఉమ్మడి నిబద్ధతకు నిదర్శనం



స్కోప్జే, జూలై 22 (మనప్రజాప్రతినిధి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉత్తర మాసిడోనియా అధ్యక్షురాలు గోర్దానా సిల్జనోవ్‌స్కా-డావ్‌కోవా కలిసి స్కోప్జే మ్యూజియంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం భారత్‌ఉత్తర మాసిడోనియా ద్వైపాక్షిక 3

# అనంత్‌నాగ్‌లో ఉగ్రదాడి...జవాన్ మృతి

మెదటి పేజీ తరువాయి



మృతుడిని ఆషిక్ హుస్సేన్‌గా గుర్తించారు. మరో జవాన్‌కు ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఉగ్రదాడి అనంతరం భద్రతా దళాలు సంఘటన ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఉగ్రవాదులు తప్పించుకోకుండా అన్ని మార్గాలను మూసివేసి విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేసి ఉగ్రవాదుల కోసం గాలింపు కొనసాగిస్తున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల గుర్తింపు, వారి కదలికలపై సమాచారం సేకరిస్తున్నారు. భద్రతా సంస్థలు పరస్పర సమన్వయంతో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయి.మరోవైపు రాజౌరి సెక్టార్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సుందర్‌బని సెక్టార్‌లోని మహదేవ్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న జవాన్ సుఖ్‌ప్రీత్ సింగ్ (27) ప్రమాదవశాత్తు ఎత్తైన ప్రదేశం నుంచి జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఛలో లోక్‌భవన్‌లో కాంగ్రెస్ నిరసన



హైదరాబాద్, జూలై 22 (మనప్రజాప్రతినిధి): నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విద్యార్థులు, యువజన సంఘాలు చేపట్టిన నిరసనలకు మద్దతుగా నిలిచిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, విద్యార్థులను పోలీసులు అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం మండిపడింది. ఈ అరెస్టులను నిరసిస్తూ బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో లోక్‌భవన్ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మహమ్మద్ అజారుద్దీన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు, వేలాది మంది కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం సమీపంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు ధర్నా చేపట్టారు. చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేసిన అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తూ భారీ ర్యాలీగా లోక్‌భవన్ వైపు కదిలారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ నాయకులు దేశవ్యాప్తంగా నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై పోలీసు బలగాలను ప్రయోగించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును హరించడం సమర్థనీయం కాదన్నారు.ప్రజల సమస్యలను లేవనెత్తే ప్రతిపక్ష నాయకులను, విద్యార్థులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, విద్యార్థుల ఆందోళనలను గౌరవించి వారికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించాలని, స్వతంత్ర దర్యాప్తుకు ఆదేశించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు.

# భోగాపురానికి మోదీకి ఆహ్వానం

మెదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ, జూలై 22 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన ఈ భేటీలో ఆగస్టు 1న జరగనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుగా నిలుస్తుందని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి తప్పక హాజరు కావాలని వారు కోరారు.మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమ నిర్వహణను సమన్వయం చేసేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్‌లకు వివిధ బాధ్యతలు అప్పగించారు. ప్రజా సౌకర్యాలు, పారిశుద్ధ్యం, రవాణా, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఈ అధికారులతో పాటు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేస్తూ ప్రారంభోత్సవ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు.విజయనగరం జిల్లాలో నిర్మితమవుతున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి కీలక మలుపు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటకం, రవాణా రంగాలు మరింత అభివృద్ధి చెందడంతో పాటు వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రతి ఏర్పాటును సమర్థవంతంగా పూర్తి చేసి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# 7 వేల మెగావాట్ల షాక్‌నూ తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ

మెదటి పేజీ తరువాయి




హనుమకొండ, జూలై 22 (మన ప్రజాప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరిగి, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో ఒకేసారి సుమారు 7 వేల మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ సమర్థంగా ఎదుర్కొందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాధారణంగా వర్షాకాలంలో సుమారు 11 వేల మెగావాట్లుగా ఉండే గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఈసారి 16,500 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క తెలిపారు. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో సుమారు 2 వేల మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని చెప్పారు. అయినప్పటికీ ముందస్తు ప్రణాళికలు, విద్యుత్ శాఖ సిబ్బంది సమిష్టి కృషితో రాష్ట్ర ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించగలిగామని వెల్లడించారు.కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి భారీ ఎత్తిపోతల పథకాలకు, అలాగే వర్షాభావం కారణంగా రైతులు అధికంగా బోరు మోటార్లను వినియోగించడం వల్ల ఏర్పడిన అదనపు విద్యుత్ అవసరాలను కూడా ప్రభుత్వం సమర్థంగా నిర్వహించిందని తెలిపారు. రాష్ట్రంలో పవర్‌కట్ అనే పరిస్థితి లేదని స్పష్టం చేసిన ఆయన, ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, విద్యుత్ లైన్లపై చెట్లు పడినప్పుడు మాత్రమే తాత్కాలిక అంతరాయాలు ఏర్పడతాయని, వాటిని పవర్‌కట్‌గా భావించవద్దని ప్రజలకు సూచించారు. ప్రజాబాట, పొలంబాట కార్యక్రమాల ద్వారా అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. విద్యుత్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో విద్యుత్ అంబులెన్స్ సేవలను ప్రారంభించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, నిచ్చెనలు, అవసరమైన పరికరాలతో పాటు నిపుణులైన సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా ఈ సేవలను రూపొందించామని చెప్పారు. ఉచిత టోల్‌ఫ్రీ సంఖ్య 1912కు ఫోన్ చేసిన వెంటనే కృత్రిమ మేధ సాంకేతికత ద్వారా ఫిర్యాదు నమోదై, సమాచారం వెంటనే విద్యుత్ అంబులెన్స్ బృందానికి చేరి అత్యవసర సేవలు అందించే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు వివరించారు.డిస్కంల ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేయడానికి అధిక వడ్డీతో తీసుకున్న పాత రుణాలను పునర్వ్యవస్థీకరించి రుణభారాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ చర్యలతో ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలను దేశంలోనే అత్యుత్తమ సంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తోందని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు అవసరమైన సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీని కూడా ప్రభుత్వం నేరుగా విడుదల చేస్తోందని వెల్లడించారు. విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.1.20 కోట్ల బీమా సౌకర్యం కల్పించామని, సురక్షితంగా పనిచేసేందుకు అవసరమైన భద్రతా పరికరాలు, యూనిఫారాలు అందించామని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత ఆధునికంగా, ప్రజలకు మరింత చేరువగా తీర్చిదిద్దేందుకు అన్ని స్థాయిల్లో సంస్కరణలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# రాహుల్, ప్రియాంక అరెస్టును ఖండించిన రేవంత్


మెదటి పేజీ తరువాయి




కొడంగల్, జూలై 22 (మనప్రజాప్రతినిధి): జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అరెస్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ప్రశ్నపత్రం లీక్ వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కు ఉందని, దానిని గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం జరిగిందన్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలకు చోటు ఉండకూడదని, ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలు తగవని అన్నారు. నిరసన హక్కును పరిరక్షించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. నిరసన సందర్భంగా అదుపులోకి తీసుకున్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుతం ఎక్కడ ఉన్నారనే విషయాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని సంబంధిత అధికారులను కోరారు. విద్యార్థుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని సూచించారు.అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడటంలో కాంగ్రెస్ ఎప్పుడూ వెనుకడుగు వేయలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల హక్కులు, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో రాజీపడబోమని అన్నారు. కొడంగల్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రశ్నపత్రం లీక్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు

మెదటి పేజీ తరువాయి



ఎదురుచూస్తున్న శాశ్వత ఇంటి పట్టాల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేస్తోందని లోకేశ్ అన్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించడం వల్లే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు.మంగళగిరి ప్రజలే తన కుటుంబమని, వారి ప్రేమాభిమానాలు, ఆశీస్సులే తనకు కొండంత బలమని లోకేశ్ తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి చెప్పారు. సొంత ఇంటి హక్కు కల్పించడం ద్వారా వేలాది కుటుంబాలకు భద్రమైన జీవనానికి పునాది వేస్తున్నామని వివరించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ ప్రాంగణంలో హర్షాతిరేక వాతావరణం నెలకొంది. మంగళగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# చేగుంట లో ధర్నా, రాస్తారోకో...



మనప్రజాప్రతినిధి// తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట , జూలై 21: ఢిల్లీలో "చలో పార్లమెంట్" కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్,సీజెపి కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని, అలాగే ప్రతిపక్ష పార్టీ నాయకులు రాహుల్ గాంధీ ని అరెస్ట్ ను నిరసిస్తూ, రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు, అలాగే , దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అదేశాల మేరకు చేగుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా లో ధర్నా, రాస్తారోకో,నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా వ్యవస్థ సంస్కరణలు, పరీక్షల పేపర్ లీకేజీల నివారణ కోసం పోరాడుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రధాన మంత్రి మోడీ,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని, మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు మసాయి పేట్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు మొహమ్మద్ ముజామిల్, స్టాలిన్ నర్సిములు, ఇబ్రహీం పూర్ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్, చిన్న శివనూర్ ఉపసర్పంచ్ బోలా ప్రశాంత్, మోహన్ నాయక్, సతీష్, నళిని, రాజు, మహేష్,నాయకులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి




మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ:జనగామ నియోజకవర్గం. మన దేశము లోని మన రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర రాకుండా మన ఉత్పత్తులకు నష్టం కలిగించే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని స్వదేశీ రైతులను నష్టపరిచే చర్యలు మానుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకటమావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం రోజున చేర్యాల మండల కేంద్రంలో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను పాత బస్టాండ్ ఆవరణలో దగ్ధం చేసి నిరసన తెలుపడం జరిగింది.ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి కొంగరి వెంకట మావో మాట్లాడుతూ భారతదేశంపై అనేకాంక్షలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం భారతదేశ రైతులను నష్టపరిచే విధంగా ఉందని దీన్ని వెంటనే రద్దు చేయాలని,ఇప్పటికే స్వదేశీ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక పండిన పూర్తి ధాన్యాన్ని ప్రభుత్వం కొనే పరిస్థితి లేక రైతులను ఇబ్బంది పాలు చేసిన పరిస్థితి ఉందని దేశంలో వేలాది మంది రైతులు వ్యవసాయంలో పెట్టుబడికి అప్పులు తెచ్చి కట్టలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఈ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం కారణంగా అమెరికాలో పండుతున్న పంటలను భారతదేశానికి ఎలాంటి ఆంక్షలు లేకుండా పత్తి,మొక్కజొన్న గోధుమలు,పాల ఉత్పత్తులు,చికెన్ ఉత్పత్తులు,అమెరికాలో పండుతున్న పంటలన్నీటిని యదేచ్ఛగా అమెరికా భారతదేశానికి దిగుమతి చేసిన చేయడం వల్ల మన రైతులు మన దేశ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక అతి తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని నష్టపోయే పరిస్థితి ఉంటుందని ఈ విధానం సరైనది కాదని వెంటనే ఈ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దుచేయాలని,రైతులను నష్టపరిచే విధానాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేయడం జరిగింది.రాబోయే రోజుల్లో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటలు ఉధృతం చేస్తామని ఈ పోరాటాల్లో రైతులు కుట్రలను నిరసిస్తూ పెద్ద ఎత్తున పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యకర్తలు తుప్పర్తి రాజు,నంగి మైసయ్య,బియ్య సిద్ధులు,కత్తుల నరసింహ రెడ్డి,పండుగ యాదగిరి,సూర్ణ తిరుపతి,యాదారం బ్రహ్మయ్య,తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీ య వరి సాగు చేయు విధానం...



మనప్రజాప్రతినిధి//పాయకరావుపేట:పాయకరావుపేట మండలం ఎస్.నరసాపురం గ్రామం లో డీపీఎం లచ్చన్న జిల్లా ఇంచార్జ్ గోవింద్ ఆధ్వర్యంలో దేశీయ వరి సీడ్ 26 రకాలు వెరైటీస్ తో ఎక్స్పరిమెంట్ ప్లాట్ లో డీపీఎం లచ్చన్న భూమి పూజ చేయుడం జరిగింది.భూమి నీ 26 బెడ్స్ గా కొలతలు తో తయారీ చేసుకొని, ఘన జీవామృతం వేసి వరి సీడ్ తో పాటు మినుములు, పెసలు, బెండ, గోరుచిక్కుడు, బొరాబటి, బీర, ఆనప, విత్తనాలు సీడ్ పెల్లిటేష్టిన్ చేసి 26 లో బెడ్స్ వేయడం జరిగింది.డీపీఎం లచ్చన్న మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం ప్రజల ఆరోగ్యాలపై విపరీతమైన దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. దీంతో అధికశాతం రైతులు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా దేశీయ విత్తనాలకు గిరాకీ పెరిగింది. సారవంతమైన, చదునైన, సులభంగా నీరు బయటకు పోవడానికి భూములలో తక్కువ నీటితో తక్కువ సస్యరక్షణ వ్యయంతో అధిక దిగుబడులను సాధించగల వరి సేద్య విధానమే సేద్యం, వరిసాగు పద్ధతిలో తక్కువ ఖర్చు మరియు తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చుని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందిలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# జూలై 24 న రాష్ట్ర వ్యాప్తంగా విద్య సంస్థల బంద్




మనప్రజాప్రతినిధి// తెలుగు దినపత్రిక :ఢిల్లీలో జరిగిన లాఠీ చార్జ్ కు నిరసనగా ఈనెల 24న జరిగే విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి అని యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు జగన్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థి యువతపై జరిగిన లాటి చార్జి కు నిరసనగా మరియు నీట్ పేపర్ కు లీకేజీ అయినా చీూా ను రద్దుచేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఈనెల 24న జరిగే విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని విద్యార్థులను కోరారు విద్యార్థులపై యువతపై జరిగిన దాడిని యుఎస్ఎఫ్ఐ గా తీవ్రంగా ఖండిస్తున్నామని వారు అన్నారు ప్రశ్నిస్తే లాటి చార్జిలా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే ఈ సమస్యకు పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు

# అపోలో డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



సదాశివపేట మండల్ రిపోర్టర్ జూలై 22 //(మనప్రజాప్రతిని దినపత్రిక):సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీ, గణేష్ కట్ట సమీపంలో ప్రజలకు నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నొస్టిక్ సెంటర్ను సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఆధునిక వైద్య పరీక్షలు స్థానికంగానే అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని, ఇలాంటి డయాగ్నొస్టిక్ సెంటర్లు ప్రజలకు సమయం, ఖర్చు ఆదా చేయడంతో పాటు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కేంద్రం ద్వారా సదాశివపేటతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ ప్రోప్రైటర్లు మహమ్మద్ యూనుస్, మహమ్మద్ యూసుఫ్, వీరేష్, సంగమేష్, నూతన్, ఫెరోజ్, రజినీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే పి.ఎం.ఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, తాలెల్మ రాము, సోమ శంకర్, అఖిల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపైకి రావొద్దు




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం ప్రజా వినియోగం కోసం నిర్మించిన రోడ్లను కాపాడుకోవడం అందరి బాధ్యత.ట్రాక్టర్ యజమానులు రైతులు జాగ్రత్తలు పాటించాలి.సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్.వ్యవసాయ పనుల నిమిత్తం ఇనుప దమ్ము చక్రాలు అమర్చిన ట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రధాన రహదారులపైకి తీసుకురావద్దని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఒక ప్రకటనలో రైతులను, ట్రాక్టర్ యజమానులను కోరారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పొలం పనుల కోసం ట్రాక్టర్లకు దమ్ము చక్రాలను ఉపయోగించడం సహజమే అయినప్పటికీ, ఆ పనులు పూర్తి కాగానే వాటిని తొలగించి సాధారణ టైర్లతోనే రోడ్లపైకి రావాలని స్పష్టం చేశారు. ఇనుప చక్రాల రాపిడి వల్ల ప్రభుత్వాలు కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించే తారు రోడ్లు తీవ్రంగా ధ్వంసమవుతున్నాయని అన్నారు. రహదారులు పాడైపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా, ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల రవాణా సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రోడ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాబట్టి రైతు సోదరులు, ట్రాక్టర్ యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్పష్టం చేశారు.

# నీట్ అవకతవకలపై పార్లమెంట్ వద్ద ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి నిరసన




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక:న్యూ ఢిల్లీ. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద బుధవారం ఇండియా కూటమి ఎంపీలతో కలిసి నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి పారదర్శక విచారణ జరిపి, విద్యార్థులకు న్యాయం చేయాలని రఘురాం రెడ్డి కోరారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల గొంతుకను అణచివేయడం కాకుండా, వారి సమస్యలను పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఇండియా కూటమి ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన రఘురాం రెడ్డి, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

